యాలాల, ఫిబ్రవరి 20: తాండూరు పట్టణం ఇందిరానగర్‌కు చెందిన ఫరానా బేగం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సీఎం సహాయనిధి కింద రూ. 2 లక్షల 50వేల ఎల్‌ఓసీ మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు గురువారం హైదరాబాద్‌లో అందజేశారు. దీంతో బాధిత కుటుంబీకులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య ఉన్నారు.

నేడు కరెంటు సరఫరా బంద్

పరిగి, ఫిబ్రవరి 20: 33కేవీ విద్యుత్ కొత్త లైన్ పనుల వల్ల శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిగి మండలంలోని మాదారం, పేటమాదారం, రంగాపూర్, బసిరెడ్డిపల్లి, నజీరాబాద్, న్యామత్‌నగర్, రంగాపూర్ తండా, పరిగిలోని సన్‌సిటీ కాలనీ, జయంతినగర్, కేఆర్‌ఆర్ కాలనీ, ఎన్‌ఆర్‌ఐ కాలనీ, మధురానగర్‌కాలనీ, లక్ష్మీనగర్, ఆర్‌టీసీ కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు మేకల సంత ప్రారంభం

బంట్వారం, ఫిబ్రవరి 20 : బంట్వారం మండల కేంద్రంలో శుక్రవారం మేకలు, గొర్రెల సంత(అంగడి)ను ప్రారంభించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి గురువారం తెలియజేశారు. మం డల పరిధిలోని పరిసర గ్రామాల రైతు లు తమ మేకలు, గొర్రెలను స్థానికంగా విక్రయించుకోగలరన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం సంత కొనసాగుతుందని చెప్పారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

బషీరాబాద్, ఫిబ్రవరి 20 : ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన బాలుడి అంత్య క్రియలకు బషీరాబాద్ ఎస్సై పి. శంకర్ రూ. 10వేలు ఆర్థిక సాయం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. మండల కేంద్రంలోని టాకీతండాకు చెందిన రాథోడ్ వెంకటేశ్ కొడుకు రాథోడ్ శ్రీరామ్ బుధవారం సాయంత్రం రోడ్డు ప్రక్కన నడుచుకుంటు వెళ్లుతుండగా తాండూరు నుంచి క్యాగ్గీరా వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో బాలుడిని ఢీకొనడంతో తీవ్ర గాయాలై మృతి చెందిన విషయం తెలిసింది. మృతుడి కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ఎస్సై బాలుడి అంత్యక్రియలకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎస్సై చేసిన ఆర్థిక సహాయానికి తండా వాసులు ప్రశంసలు వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్య అందించాలి



బంట్వారం/కోట్‌పల్లి, ఫిబ్రవరి 20 : పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం మన విధి అని ఎంఈవో చంద్రప్ప పేర్కొన్నాసు. గురువారం కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి యొక్క సామర్థ్యాన్ని గుర్తించి, వారికి అవసరమై విద్యా మెళకువలు తెలియజేస్తే, వారు భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాన్ని చేరుకుంటారన్నారు.

ఉడికించిన చికెన్ తినడం వలన ఎలాంటి నష్టం లేదు

వికారాబాద్, ఫిబ్రవరి 20: ఉడికించిన చికెన్ తినడం వలన ఎలాంటి నష్టం లేదని వికారాబాద్ పశు సంవర్ధక, పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ పూర్ణచందర్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చికెన్‌ను 70 డిగ్రీల వద్ద ఉడికిస్తే చికెన్‌లో ఉన్న వైరస్ చనిపోతుందన్నారు. వైరస్ చనిపోవడంతో చికెన్ తినడం వలన ఎలాంటి ముప్పు లేదని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. వికారాబాద్‌కు ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి కోళ్లు సరఫరా అవుతాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని కోళ్లకు ఎలాంటి వ్యాధులు రాలేవన్నారు. వికారాబాద్ ప్రాంత ప్రజలు నిర్భయంగా చికెన్, కోడి గుడ్లను తినవచ్చని తెలిపారు.

వైకుంఠధామం వద్ద కలుపు మొక్కలు తొలగిస్తాం

మర్పల్లి, ఫిబ్రవరి 20: వైకుంఠధామం వద్ద కలుపు మొక్కలు తొలగించి గుంతల్లో మొరం వేయనున్నట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వైకుంఠధామం వద్ద ముళ్ల పొదలను తొల గించడానికి గ్రామస్తులతో కలిసి పరిశీలించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వివిధ పోటీలకు హాజరైన క్రీడాకారులు

వికారాబాద్, ఫిబ్రవరి 20 : ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యం కోసం రోజులో కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామం కోసం కేటాయించాలని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. గురువారం తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణం సాకేత్ నగర్ లోని గౌలికర్ నర్సింగ్ ఫంక్షన్ హాల్ లో 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా బాల, బాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరకంగా, మానసికంగా శక్తి సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. కలిసి ఆడడం వలన క్రీడాకారుల్లో నాయకత్వ లక్షణాలు వస్తాయని తెలిపారు. కబడ్డీ మన దేశ జాతీయ క్రీడ, పూర్వకాలం నుంచి ఇది గ్రామీణ క్రీడ, కబడ్డీ ఆటకు, ఆట గాళ్లకు ఎప్పుడూ ఆదరణ లభిస్తుందని కొనియాడారు. కబడ్డీ ఆటతో శరీరానికి మంచి వ్యాయామం అవుతుందని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎల్లప్పుడు ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు, కోచ్ లు, యువతీ యువకులు పాల్గొన్నారు.

గడ్డ మైసమ్మ జాతరలో స్పీకర్..

వికారాబాద్ పట్టణ పరిధి దన్నారం ప్రజలు గురువారం భక్తి శ్రద్ధలతో గడ్డ మైసమ్మ జాతర ఉత్సవాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు, నైవేద్యాలు, బోనాలు సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై పూజలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు చేశారు. అనంతరం దేవాలయం వద్ద రూ. 30 లక్షల నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. స్పీకర్‌తో పాటు నాయకులు అర్ధ సుధాకర్ రెడ్డి, కిషన్ నాయక్, రామచంద్రారెడ్డి, మల్లేశ్, రత్నారెడ్డి, సత్యం, మహిపాల్ రెడ్డి, చిగుళ్లపల్లి రమేశ్ ఉన్నారు.

మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్

వికారాబాద్, ఫిబ్రవరి 20 : ఇరువురు రాజీ కుదిరేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో నాలుగు నియోజకవర్గాలలోని పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల మార్చి 8 వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌దాలత్‌లో రాజీపడదగ్గ కేసులను చిన్న చిన్న తగాదాల కేసులు రాజీ కుదుర్చుకోవచ్చన్నారు.మోటార్ వెహికిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీపడేలా పోలీసులు సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి చంద్రకిషోర్, జిల్లా న్యాయసేవ సెక్రటరీ డీబీ షీతల్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి యం వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ , పీపీలు దీపారాణి, అన్వేష్ సింగ్ , సమీనా బేగం, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి , మొమిన్‌పేట ఎస్సై అరవింద్, సంబంధిత పోలీసులు , కోర్ట్ అధికారులు పాల్గొన్నారు.

బంజారా బిడ్డలు భక్తి భావం కలిగి ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్ నాయక్

పెద్దేముల్, ఫిబ్రవరి 20 : గోర్ బంజార ప్రతి బిడ్డ భక్తి కలిగి ఉండాలని తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం కందనెల్లి సమీపంలోని యాడి బాపు గుట్టపై జాగో బంజార సమాజ్ వ్యవస్థాపకులు సురేందర్ నాయక్, ఆయన సతీమణి రమావత్ శాంతిదేవిలు యాడి బాపుగడ్ దేవస్థాన ఆధ్యాత్మిక కేంద్రాన్ని రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ యాడి బాపుగాట్‌పై త్వరలో భక్తులకు తాగు నీటి వసతి కోసం బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మధులత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి20: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం, సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం జోగిపేట్ గ్రామానికి చెందిన గంజి ఎల్లా దాస్ (41) కుటుంబ సభ్యులతో నగరానికి వలస వచ్చి మేడ్చల్ కండ్లకోయలో కొన్ని రోజులుగా నివాసం ఉంటున్నారు. తన ద్విచక్ర వాహనంపై మేడ్చల్ నుంచి కొంపల్లి వైపు వస్తుండగా మార్గమధ్యలో రాజరాజేశ్వరి టెంపుల్ వద్దకు రాగానే అతివేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. దీంతో గంజి ఎల్లా దాస్ నడుముకు బలమైన గాయం కావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తుక్కు మాటున.. గంజాయి రవాణా

- సోలోగా వందల కిలోమీటర్ల డ్రైవింగ్
- విషయం లీక్ కాకుండా జాగ్రత్తలు
- ఏపీ టూ మహారాష్ట్రకు యథేచ్ఛగా మత్తు పదార్థం
- నిందితుడి అరెస్ట్ - రూ. 1.05 కోట్ల సొత్తు స్వాధీనం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): ఒకే ఒక్కడు.. కంటెయినర్లో తుక్కు మాటున గంజాయిని ఏపీ నుంచి హైదరాబాద్ మహా నగరం మీదుగా మహారాష్ట్రకు తరలిస్తూ రాచకొండ పోలీసులకు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్‌గా పట్టుబడ్డాడు. ఇది వరకే రెండుసార్లు ఇలా గంజాయి స్మగ్లింగ్ చేసిన అనుభవంతో మూడోసారి కూడా అలాగే చేద్దామని వెళ్లి మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులకు దొరికిపోయిండు. ఎల్బీనగర్ లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు ఇందుకు సంబంధిత వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని పూణేకు చెందిన అహ్మద్ గులాబ్ షేక్ డ్రైవర్. ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఈజీ మనీ సంపాదనకు గంజాయిని స్మగ్లింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగానే పూణేకు చెందిన వైభవ్, దేవలను కలిసి గంజాయి రవాణా విషయంపై మాట్లాడారు. తమకు ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ నుంచి గంజాయిని తెచ్చి ఇస్తే ఒకో ట్రిప్పుకు రూ.3 లక్షలు ఇస్తామంటూ వైభవ్, దేవలు ఒప్పందం చేసుకున్నారు. దీంతో అహ్మద్ గులాబ్ తన వద్ద ఉన్న టాటా కంటెయినర్ (ఎంహెచ్-16-సీడీ-2076)లో స్క్రాప్ వేసుకుంటాడు. తాను ఒక్కడే డ్రైవ్ చేసుకుంటూ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాడు. తన వద్దనున్న తుక్కులో గంజాయి ప్యాకెట్లను కలిపేసి తిరిగి అరకు, రాజమండ్రి, సత్తుపల్లి, ఖమ్మం మీదుగా హైదరాబాద్ వైపు వచ్చి ఓఆర్‌ఆర్ మీదుగా మహారాష్ట్ర రూట్‌లో వెళ్లిపోతుంటాడు. ఇతడు ఒక్కడే ఎంత దూరమైనా డ్రైవ్ చేసుకుంటూ వెళ్తాడు. క్లీనర్‌ను, ఇతరులను ఎవరిని నమ్మడు. తన వాహనంలో గంజాయి ఉన్న విషయం బయటకు పొక్కుతుందనే భావనతో ఒక్కడే లారీలో ఉంటాడు. ఈ క్రమంలోనే ఒకసారి 200, మరో సారి 150 కిలోల గంజాయిని మహారాష్ట్రకు తరలించి వైభవ్, దేవలకు అప్పగించాడు. ఇటీవల మరోసారి గంజాయి రవాణా చేసేందుకు సిద్ధమై విశాఖపట్టణం వెళ్లాడు. అక్కడ బుజ్జిబాబు అనే వ్యక్తిని కలిసి అతని వద్ద 300 కిలోల విలువైన 138 గంజాయి ప్యాకెట్లను తన కంటెయినర్లో దాచుకొని తిరిగి మహారాష్ట్రకు పయనమయ్యాడు.

అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓఆర్‌ఆర్ వద్దకు ఈ కంటెయినర్ గురువారం రాగానే మహేశ్వరం ఎస్‌ఓటీ, అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు సంయుక్తంగా లారీని ఆపి తనిఖీలు చేయడంతో అందులో ఉన్న గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. ఈ మేరకు రూ.1.05 కోట్ల విలువైన 300 కిలోల గంజాయి, కంటెయినర్లను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్ట్ చేశారు. గంజాయి సరఫరా చేసిన వాడితో పాటు మహారాష్ట్రలో గంజాయి విక్రయాలు చేస్తున్న వారి గూర్చి ఆరా తీస్తున్నామని, ఆయా రాష్ట్రాల పోలీసుల సహకారంతో వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీపీ వెల్లడించారు.

ఉద్యమకారులకు ఇంటిస్థలాలివ్వాల్సిందే

ప్రభుత్వానికి ఉద్యమకారుల ఫోరం అల్టిమేటం

జవహర్‌నగర్, ఫిబ్రవరి 20: పస్తులిండి లాఠీ దెబ్బలిని తెలంగాణ ఉద్యమం చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలివ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ నేతృత్వంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు పిన్నొజు సుధాకర్‌చారి ఆధ్వర్యంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరూతూ గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు ఉద్యమ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్‌చారి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకాలకు 250గజాల ఇంటిస్థలంతో పాటు నాలుగు గదుల ఇల్లు నిర్మించి అందజేయాలని పేర్కొన్నారు. ఉద్యమంలో పని చేసి లబ్ధిపొందని వారికి తెలంగాణ సంస్కృతి సారథిలో వివిధ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు చేయాలని కోరుతూ సీఎంకు పోస్టుకార్డులు రాసి పోస్టుడబ్బాలో ఉత్తరాలు రాసి వేశారు. ఈ కార్యక్రమంలో ఆనందాస్ ప్రకాష్, కూటికంటి వెంకటేష్, కుమ్మరి నర్సింహ, సత్యనారాయణ, ఆకుల నర్సయ్య, పాము భాస్కర్, పరుశురాం, ఎల్లస్వామి, సోమయ్య, మహేశ్, కాసీం, చంద్రశేఖర్, నర్సింహయాదవ్, కృష్ణయాదవ్, నరేష్‌యాదవ్, రమేష్‌చారి, పుష్ప, మహేశ్వరి, మల్లమ్మ పాల్గొన్నారు.

నిరాశలో సీనియర్ ఎంవీఐలు!

- ఆర్టీఏలో కొలిక్కి రాని పదోన్నతుల ప్రక్రియ
- అదనపు విధులతో సతమతమవుతున్న ఎంవీఐలు
- రెండు కార్యాలయాలకు ఒక్కరే ఆర్టీవో
- గ్రేటర్ రవాణా శాఖలో అధికారులపై పనిభారం
- రిటైర్మెంట్‌కు ముందు పదోన్నతి వస్తే సంతోషం: ఎంవీఐలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): గ్రేటర్ ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారులపై పనిభారం పెరుగుతున్నది. పదోన్నతులు చేపట్టాలని రవాణా శాఖా సిబ్బంది ప్రభుత్వానికి మొరపెట్టుకున్నది. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో వాళ్లంతా నిరాశ చెందుతున్నారు. సీనియర్ ఎంవీఐలకు ఆర్టీఓలుగా పదోన్నతి కల్పించాలని రవాణా శాఖ మంత్రిని ఇటీవల కలిసి వాళ్లంతా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం వారు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆర్టీఏ కార్యాలయాల్లో సరిపడా సిబ్బంది లేక సతమతమవుతున్నారు. గ్రేటర్‌లో ఉప్పల్, బండ్లగూడ, సికింద్రాబాద్, నాగోల్ కార్యాలయాలకు పూర్తి స్థాయి ఆర్టీఓ అధికారి లేరు. ఇన్‌చార్జి ఎంవీఐలకే అదనపు బాధ్యతలు అప్పగించి కాలం వెల్లదీస్తున్నారు. ఇందులో సీనియార్టీ ఉన్న కొందరు అధికారులు తమకు ఆర్టీఓలుగా పదోన్నతి కల్పిస్తే తమ బాధ్యతలు తాము చూసుకుంటామని చెబుతున్నారు. మేడ్చల్ డీటీఓ రఘునందన్ గౌడ్ ఉప్పల్ కార్యాలయానికి ఇన్‌చార్జీ ఆర్టీఓగా ఉన్నారు. కానీ, ఇక్కడ సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డియే కార్యకలపాలు నిర్వహించాల్సి వస్తుంది. ఇక, నాగోల్‌లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్ కూడా అదనపు పనిభారం మోయాల్సి వస్తుంది. మరోవైపు బండ్లగూడ కార్యాలయానికి కూడా మలక్‌పేట ఆర్టీఓ కిష్టయ్యనే పనిభారం మోయాల్సి వస్తుంది. ఉదయం ఓ కార్యాలయం.. మధ్యాహ్నం మరో కార్యాలయంలో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఆయనది. మరో కార్యాలయం సికింద్రాబాద్‌లోనూ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ యెర్రి స్వామి ఇన్‌చార్జి ఆర్టీఓలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, వాళ్లకు రవాణా శాఖలో పదోన్నతికి తగిన అనుభవం ఉన్నప్పటికీ ఆర్టీఓలుగా ప్రమోషన్ రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిటైర్మెంట్‌కు ముందు పదోన్నతి కల్పిస్తే చాలా సంతోషిస్తామంటూ చెబుతున్నారు. ప్రతిరోజు 200 మందికి పైగా వాహనదారులు సంబంధిత పనులపై కార్యాలయాలకు వస్తుంటారు. ఓ వైపు వార్షిక టార్గెట్ పూర్తి చేయడం, వాహనాల తనిఖీలతో పాటు అదనపు విధులు చేయక తప్పని పరిస్థితులు రవాణా శాఖలో ఉన్నాయని ఎంవీఐలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రమాబాయి అంబేద్కర్ కమిటీ ఎన్నిక

కొడంగల్, ఫిబ్రవరి 20: పట్టణంలోని 12వ వార్డులో అంబేద్కర్ ప్రజా సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ కమిటీని గురువారం ఏకగ్రీవంగాఎన్నుకొన్నారు. అధ్యక్షురాలుగా ఎల్లమ్మ, ఉపాధ్యక్షులుగా భారతి, శిరీషా, కృష్ణవేణి, జనరల్ సెక్రేటరీగా వెంకటమ్మ, సహాయ కార్యదర్శిగా అంజమ్మ, కోశాధికారిగా సరస్వతి, అమృతమ్మ, కల్చరల్ సెక్రెటరీగా శోభ, సావిత్రిలతో పాట సలహాదారులుగా ఆశమ్మ, నరసమ్మ, పద్మమ్మ, శాంతమ్మ, అంజిలమ్మ, లక్ష్మిలను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కులకచర్ల, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని కుస్మసముద్రం చెరువుముందలితండాలో తండాకు చెందిన చిన్నమ్మకు రూ 60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంచందర్‌నాయక్, సీనియర్ నాయకులు శంకర్ నాయక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకుడు పాండునాయక్, తండా వాసులు పాల్గొన్నారు.

మరికల్ ఫైన్‌ఆర్ట్స్‌విద్యార్థిని ప్రతిభ

కులకచర్ల, ఫిబ్రవరి 20 : హైదరాబాద్ జేఎన్‌టీయూలో నిర్వహించిన హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ 84వ ఆల్‌ఇండియా వార్షిక ఆర్ట్ ఎగ్జిబిషన్ 2025లో చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన విద్యార్థిని ప్రతిభను కనబర్చారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఫైన్ ఆర్ట్స్ కళాకారులు హాజరై వారి ప్రదర్శన నిర్వహించారు. అందులో వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మరి కల్ గ్రామానికి చెందిన ఫైన్ ఆర్ట్స్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వడ్ల పూజా చారి స్టోన్ కార్వింగ్‌లో అత్యంత ప్రతిభను కనబర్చి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఎక్సలెన్స్ బహుమతికింద 25వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

శ్రీశైలానికి శివస్వాములు ..

మర్పల్లి, ఫిబ్రవరి 20 : మండల కేంద్రానికి చెందిన శివస్వాములు గురువారం ఇరుముడితో శ్రీశైల క్షేత్రానికి బయలుదేరారు. గ్రామంలో 41 రోజుల పాటు దీక్ష గావించిన స్వాములు గురువారం ఉదయం నుంచి శివాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడి కట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శ్రీశైలానికి వాహనాల్లో బయలు దేరారు. ఇరుముడి కట్టిన తరువాత దేవాలయం వద్ద అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం

ధారూరు, ఫిబ్రవరి 20: మండల వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పాలకవర్గం సభ్యులతో సమావేశం నిర్వహించారు. పాలకవర్గ పదవీకాలం పూర్తి కావడం, మళ్లీ ప్రభుత్వం పొడగించడంతో ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.పాలకవర్గ సభ్యులను పీఏసీఎస్ సీఈవో నర్సింహులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఘనంగా తుల్జాభవానీ పూజలు..

కులకచర్ల, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ పంచాయతీ చాకల్‌పల్లి తండాలో గురువారం గిరిజన కుటుంబీకుల ఆధ్వర్యంలో తుల్జాభవాని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తుల్జాభవాని అమ్మవారికి సాంప్రదాయ పద్ధతులతో పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలను అన్ని వేళల్లో కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి నర్సింహులు యాదవ్, బీసి సెల్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, అంబు, సోమలింగం, పాల్గొన్నారు.